సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 4 । అక్టోబర్ । 2023



మల్టీడేస్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

కడప నగరంలోని కేఎస్ఆర్ఎం కేఓఆర్ఎం మైదానాలు వేదికగా ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమైంది. -8లో..



ప్రైవేటు స్కూల్ వ్యాన్ బోల్తా

మండలంలోని తుమ్మలపల్లి సమీపాన ఎర్రగుంట్లకు చెందిన జీవన జ్యోతి స్కూల్ వ్యాన్ మంగళవారం బోల్తా పడింది. వ్యాన్‌ను క్రేన్ సాయంతో బయటకు తీశారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.84	రూ.100
రెండోరకం	రూ.50	రూ.82

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 416 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	480	547
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 582.360 కిలోలు

న్యూస్‌రీల్

బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేత



బెంగుళూరులో గంగిరెడ్డికి పింఛన్ ఇస్తున్న వలంటీర్

రాయచోటిటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వాలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చిన తరువాత ఇంటి వద్దకే పింఛన్ ఇస్తున్నారు. కొన్ని సందర్భాలలో ఫించన్ ఇచ్చే సమయానికి ఆనారోగ్య కారణాలతో ఆస్పత్రులలో ఉన్న సమయంలో వలీంటర్లు అక్కడికే వెళ్లి అందిస్తున్నారు. రాయచోటి రూరల్ పరిధిలోని జిపి.కుమ్మరపల్లెకు చెందిన గంగిరెడ్డి అనారోగ్యంతో బెంగుళూరుకు వెళ్లారు. ఆస్పత్రులలో వైద్య చేయించుకొని పరీక్షల కోసం మళ్లీ రావాలని సూచించడంతో కుమార్తె ఇంటిలో విశ్రాంతి తీసుకొంటున్నారు. స్వగ్రామానికి వచ్చేందుకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న వాలంటీర్ చిన్నరాయుడు బెంగుళూరుకే వెళ్లి పింఛన్ అందజేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థపై గంగిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: దసరాకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జిల్లాలోని ఆరు డిపోల నుంచి బస్సులు నడపనున్నామన్నారు. హైదరాబాద్‌కు 75, బెంగళూరుకు 60, విజయవాడకు 30, చెన్నైకు 10 చొప్పున 175 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన దూర ప్రాంత ఉద్యోగులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ పురోభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు.

ఐటీఐలో దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మిగిలి సీట్ల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మైనార్టీల ఐటీఐ ప్రధానాచార్యులు జ్ఞానకుమార్ తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్ పాస్ లేక ఫెయిల్ అయిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. iti.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. 7వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

ఎన్ఎస్ఎస్ వార్షిక పురస్కారాలు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని క్యాంపస్, అనుబంధ కళాశాలల్లో జాతీయ సేవా పథకంలో సేవలందించిన వారికి వైవీయూ ఎన్ఎస్ఎస్ పురస్కారాల ప్రదానం చేయనున్నట్లు విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా.ఎన్.వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఈ నెల 4న సర్ సీవీ.రామన్ సైన్స్ బ్లాక్‌లో పురస్కారాల ప్రదానం ఉంటుందన్నారు. ఎంపికైన వారి జాబితాను ఆయన ప్రకటించారు.

పురస్కారాలకు ఎంపికైనవారు..

ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్లు: ఆచార్య వి.సునీత(యూనిట్-5, వైవీయూ), డా. పి. వసుగోవర్ధన్ రెడ్డి(యూనిట్-8, వైవీయూ), డా.ఎం.ఓబులరెడ్డి(యూనిట్-1, వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వేంపల్లి), డా.ఎల్.రాజమోహన్‌రెడ్డి (యూనిట్-1, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజంపేట), సి.రాజారావు(యూనిట్-1, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కడప).

ఉత్తమ వలంటీర్లు: జి.వి.ఎస్. కౌసల్య (యూనిట్-1, వైవీయూ), ఎస్.వందన (యూనిట్-1, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కడప), ఎం.నాగబాలాజీ (యూనిట్-1, వైవీయూ).

ఉత్తమ కళాశాలలు: కడప ప్రభుత్వ పురుషుల కళాశాల(డా.జి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్), నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, కడప (డా.కె. సూర్య నారాయణరెడ్డి (ప్రిన్సిపల్), ఏపీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాల, నందలూరు, అన్నమయ్య (మాధవీలత, ప్రిన్సిపల్).

గ్రామ స్వరాజ్యమే..లక్ష్యం

- మెరుగైన సేవలపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ
- ఐదు బృందాల్లోని 467 మందికి పూర్తి

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామ స్వరాజ్యాన్ని సాధించాలన్న లక్ష్యం కోసం ఇంటి ముంగిటకే పాలన తీసుకెళ్లే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలన్నీ నవరత్నాల రూపంలో ప్రజలకు పారదర్శకంగా అందించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థ రూపుదిద్దుకుంది. అయితే ప్రజలకు మెరుగైన సేవలు అందినపుడే ప్రభుత్వం భావిస్తున్న సుపరిపాలన సాధ్యమవుతుంది. ఇందుకోసం పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. కడప జెడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం (డీపీఆర్‌సీ)లో గతనెల 29వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు గల పంచాయతీ కార్యదర్శులు 551 మందిలో ఇప్పటికి 467 మందికి శిక్షణ పూర్తి చేశారు. వసతి(రెసిడెన్షియల్)తో కూడిన ఆరు రోజుల శిక్షణ ఇచ్చారు. ఇందుకోసం ఒక్కో కార్యదర్శిపై రూ. 6900 ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యానంపై శిక్షణ కూడా ఇందులో ఒక భాగం. రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి జె.మురళి స్వయంగా పాల్గొని కార్యదర్శులకు శిక్షణ ఇవ్వడం విశేషం.



శిక్షణా తరగతులకు హాజరైన పంచాయతీ కార్యదర్శులు (ఇన్‌సెట్) ధ్యానంలో శిక్షణ పొందుతున్న పంచాయతీ కార్యదర్శులు

ఆరు అంశాలపై శిక్షణ

ఏపీ పంచాయతీరాజ్ చట్టం-1994, ఉద్యోగుల విధి నిర్వహణ-క్రమశిక్షణా చర్యలు, ఉపాధి హామీ పథకం, లే అవుట్ల ఏర్పాటు-అమలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, స్వమిత్వ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఇందులో తొలిరోజు గ్రామ పంచాయతీలు, స్థానిక స్వపరిపాలన, గ్రామసభల ఏర్పాటు, గ్రామ పంచాయతీ సమావేశాలు, మౌలిక సదుపాయాల కల్పన, జగనన్న పల్లె వెలుగు, జలజీవన్ మిషన్, గ్రామ పంచాయతీ విధులు-బాధ్యతలు వంటి అంశాలు ఉంటాయి. రెండో రోజు గ్రామ పంచాయతీల ఆర్థిక పరిపుష్టి, ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీ వనరుల సమీకరణ, ఇంటి పన్ను, వ్యయ నియమాలు, గ్రామ పంచాయతీల క్రమశిక్షణ, పంచాయతీల నియంత్రణ వ్యవస్థ పర్యవేక్షణ గురించి వివరిస్తారు. మూడో రోజు లే అవుట్లు, భవన నిర్మాణాల నియమాలు, ఉద్యోగులకు సంబంధించిన డిస్ట్రిక్ట్ ఆఫీస్ మాన్యువల్‌లో శిక్షణ అందిస్తున్నారు. లే అవుట్ల పరిశీలన కోసం ఫీల్డ్ విజిట్స్ కూడా ఇందులో ఉన్నాయి. నాలుగో రోజు గ్రామ పంచాయతీల సర్వే టీముల ఏర్పాటు, గ్రామ సరిహద్దులు, నోటిఫికేషన్లు, సాంకేతికత అంశాలపై శిక్షణ ఉంటుంది. ఐదో రోజు సీసీఏ నిబంధనలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల గురించి వివరిస్తారు. ఆరో రోజు నవరత్నాలు, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

మానసిక ప్రశాంతతకు ధ్యానం

ఉద్యోగులు విధి నిర్వహణలో అనేక ఒత్తిళ్లు ఎదుర్కోవడం సహజం. ఒత్తిళ్లను అధిగమించినపుడే రెట్టించిన ఉత్సాహంతో పనిచేసేందుకు వీలుంటుంది. ఇందుకోసం ప్రతిరోజు పంచాయతీ కార్యదర్శులకు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో 30 నిమిషాల పాటు ధ్యానంపై శిక్షణ ఇస్తున్నారు. ధ్యానం వల్ల శక్తి పెంపొందుతుంది. పాజిటివ్ ఫీలింగ్స్ వల్ల ఎనర్జీ పెరుగుతుంది.

శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉంది



వసతితో కూడిన శిక్షణ కారణంగా ఇతర మండలాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులతో పరిచయాలు ఏర్పడతాయి. ఒకరి అనుభవాలు మరొకరు తెలుసుకునేందుకు వీలుంటుంది. ఇన్నోవేటివ్ ఆలోచనలు, ప్రయోగాలు, ఫలితాలు గురించి తెలుసుకున్నాం. సమిత్వ కింద ఫీల్డ్ విజిట్ నిర్వహించడం వల్ల పలు విషయాలు తెలుసుకున్నాం. సచివాలయ స్థాయిలో ఉండే మిగతా సిబ్బందికి కూడా శిక్షణ ఇస్తే మరింత ఉపయోగంగా ఉంటుంది.

– ఎం.రేణుకాదేవి, పంచాయతీ కార్యదర్శి, లింగారెడ్డిపల్లె, కలసపాడు

మరిన్ని శిక్షణా తరగతులు నిర్వహించాలి



రెసిడెన్షియల్ శిక్షణలో పీఆర్ యాక్టు, జగనన్న భూ హక్కు-భూరక్ష లే అవుట్ల అప్రూవల్ వంటి అనేక అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యదర్శులు మానసిక ఒత్తిళ్ల నుంచి బయట పడేందుకు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఇచ్చిన యోగా శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడ్డాయి. చట్టాలు, పాలనా సంస్కరణలలో పలు మార్పులు కాలానుగుణంగా వస్తుంటాయి. కనుక ఉద్యోగులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండేందుకు ఇలాంటి శిక్షణలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉంది.

– సీఎం గంగులయ్య, కార్యదర్శి, చక్రాయపేట

మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం



గ్రామ పంచాయతీల్లో నిర్వర్తించాల్సిన విధులు, పనుల గురించి శిక్షణలో వివరించారు. స్వమిత్వ కార్యక్రమం కింద చెర్లోపల్లె లే అవుట్‌కు తీసుకెళ్లి డ్రోన్ సర్వేపై అవగాహన కల్పించారు. స్వమిత్వ కార్యక్రమం వల్ల గ్రామ కంఠంలో ఉండే ఇంటికి యాజమాన్య హక్కులు లభిస్తాయి. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ నందన్ స్వయంగా శిక్షణ ఇచ్చారు. ఇలాంటి శిక్షణ వల్ల గ్రామీణులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలుంటుంది.

– కె.రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి, రంగసముద్రం, పోరుమామిళ్ల

రాయచోటిలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి: రాయచోటిలో త్వరలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తామని రాయచోటి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి జిల్లా రవాణాశాఖ అధికారి కార్యాలయంలో ఐదో విడత వైఎస్ఆర్ వాహనమిత్ర లబ్ధిదారుల సమావేశం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వాహన మిత్రతో ఆటోవాలాలకు అండగా నిలిచి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వారి ఆశాజ్యోతిగా నిలిచారన్నారు. 7990 మంది ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు జగన్ ప్రభుత్వం రూ.7,99,00,000 అందజేసిందన్నారు. ఫిట్‌నెస్, బీమా, మరమ్మతుల కోసం ఆటో చోదకుల ఇబ్బందులను తెలుసుకుని ప్రభుత్వ ఈ ఆర్థిక సహాయాన్ని ఇస్తోందన్నారు. నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. అనంతరం ఆటో కార్మికులతో కలిసి ఎమ్మెల్యే సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు విజయభాస్కర్ మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీ నెరవేర్చి ఐదు విడతలుగా రూ.50 వేల సాయం అందించడంతో సంతోషం వ్యక్తం చేశారు. జై జగన్ అంటూ పెద్ద ఎత్తున ఆటోవాలాలు నినదించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి దినేష్ చంద్ర, ఎంవీఐలు అనిల్‌కుమార్, సుబ్బరాయుడు, అజయ్‌కుమార్, మార్కెట్ యార్డు చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మదన్‌మోహన్‌రెడ్డి,ఆటో అసోసియేషన్ నాయకులు విజయభాస్కర్, హబీబుల్లాఖాన్, పల్లపు రమేష్, ఆసీఫ్ అలీఖాన్, గౌస్‌ఖాన్, అల్తాఫ్, ఫయాజ్ అహమ్మద్, జయన్ననాయక్, భాస్కర్, జానం రవీంద్రయాదవ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా వీవీప్యాట్ల పరిశీలన

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: ఈ నెల 10వ తేదీలోగా బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల యాక్సెప్టెన్సీ టెస్ట్ పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. రాయచోటి మార్కెట్ యార్డులోని ఈవీఎం గోడౌన్‌లో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వివిప్యాట్ పనితీరును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల పనితీరు పరిశీలించడానికి బెల్ కంపెనీ ఇంజనీర్లు వచ్చారని, వారి ఆధ్వర్యంలో ఎలాంటి తప్పులు జరగకుండా పనితీరు తనిఖీలు పూర్తి చేయాలన్నారు. జిల్లాకు 4444 బ్యాలెట్ యూనిట్లు(బియూలు), 3950 కంట్రోల్ యూనిట్లు, 4850 వివి ప్యాట్స్ రావడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ఎన్ని యూనిట్ల పరీక్ష పూర్తయిందని కలెక్టర్ ప్రశ్నించగా.. మొత్తం 1440 పరీక్షించామని సిబ్బంది వివరించారు. ఈవీఎం గోడౌన్ బయట ఫెన్సింగ్ నిర్మాణం, సెక్యూరిటీ గార్డ్‌లు ఉండటానికి గది ఏర్పాటు అంశాలు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, తహసీల్దార్ ప్రేమంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ఓటరు జాబితా

స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు తీసుకుంటున్నామని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణ, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించి వివిధ రాజకీయ పార్టీల నుంచి అందిన దరఖాస్తులు పరిశీలిస్తున్నామన్నారు.



వీవీ ప్యాట్ పనితీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

పోలింగ్ స్టేషన్లు పరిశీలించాలి

రాయచోటి: జిల్లాలో ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులన్నింటినీ పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి నియోజకవర్గ ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈయన మాట్లాడుతూ ఆయా రాజకీయ పార్టీల నుంచి ఓటరు జాబితాపై అందిన ఫిర్యాదులలో ఒక ఫామ్ కూడా పెండింగ్‌లో ఉంచరాదన్నారు. మృతి చెందిన ఓటర్లు, బదిలీలు, నకిలీలను బీఎల్‌ఓలు క్షేత్ర స్థాయిలో పక్కాగా పరిశీలన చేసి జాబితాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తంబళ్లపల్లి, మదనపల్లి, పీలేరు, రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి నియోజకవర్గాలలో వచ్చిన దరఖాస్తులను వంద శాతం పరిశీలించాలన్నారు. పోలింగ్ స్టేషన్లను నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? లేదా? అని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు మహర్దశ

- నాడు–నేడు కింద 80 ప్రాంతాల్లో భవన నిర్మాణాలు
- కార్పొరేట్‌కు దీటుగా ప్రీ స్కూళ్ల నిర్వహణ
- ఒక్కో భవనానికి రూ. 13.50 లక్షలు వెచ్చించనున్న ప్రభుత్వం

కడప కోటిరెడ్డిసర్కిల్: అంగన్వాడీ కేంద్రాలలో ఆధునిక సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆహ్లాదకర వాతావరణంలో ఆటపాటలతో కూడిన విద్య అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 'నాడు–నేడు' కార్యక్రమాన్ని అనుసంధానం చేస్తూ అంగన్వాడీ కేంద్రాలకు మరమ్మత్తులు, అవసరమైన చోట నూతన భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. గర్భిణులు, చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా 12 ప్రాజెక్టుల పరిధిలో 2389 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో గర్భిణులకు పౌష్టికాహారం ఇవ్వడంతోపాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కనీస మరమ్మత్తులకు నోచుకోని కేంద్రాలకు నాడు–నేడు పథకం కింద రెండో దశలో 80 అంగన్వాడీ కేంద్రాలకు మరమ్మత్తులు చేపట్టనున్నారు. ఒక్కో భవనానికి ప్రభుత్వం రూ. 13.50 లక్షలు వెచ్చిస్తోంది. ఇందులో రూ.10 లక్షలు భవన నిర్మాణానికి, రూ. 2.80 లక్షలు విద్యుత్తు, నీటి సౌకర్యం, ఫర్నిచర్కు, రూ.30 వేలు మరుగుదొడ్లు, ఇతర పనులకు కేటాయించనున్నారు. భవనాల స్థాయి పెంచేందుకు ఒక్కో కేంద్రానికి రూ. 5.50 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు.

ఏడుగురు సభ్యులతో కమిటీ

భవన నిర్మాణ పనుల్లో పారదర్శకతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పర్యవేక్షణ మొదలు నిధుల వినియోగం వరకు కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించింది. ప్రతి అంగన్వాడీ కేంద్రానికి ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సభ్యులుగా అంగన్వాడీ టీచర్, గ్రామ, వార్డు, మహిళా పోలీస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తోపాటు చిన్నారుల తల్లులు ముగ్గురుటారు. కమిటీ పేరిట బ్యాంకు ఖాతా తెరిచి ఇద్దరికి చెక్ పవర్ ఇవ్వనున్నారు. బాల్య దశలోనే చిన్నారికి విజ్ఞానం పెంపొందించడంతోపాటు ఆంగ్ల మాధ్యమంలో బోధనకు అనేక చర్యలు చేపట్టింది. ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషనల్) పథకం కింద మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు సమగ్ర వికాసమే ధ్యేయంగా పలు కార్యక్రమాలను రూపొందించింది. బాలల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు పీపీ-1, పీపీ-2 పుస్తకాల ద్వారా ఆంగ్ల పదాల బోధన సాగుతోంది. ఆటపాటలతో చదువులు కొనసాగేలా అనేక చర్యలు చేపట్టింది. కేంద్రాల్లో 15 లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.



శివానందపురం అంగన్వాడీ కేంద్రం

జిల్లా:	వైఎస్సార్
ప్రాజెక్టులు:	12
అంగన్వాడీ కేంద్రాలు:	2389
పక్కా భవనాలు:	1038
అద్దె భవనాలు:	960
గర్భిణులు:	14,888
బాలింతలు:	14,239
చిన్నారులు:	1,57,015



పోషకాహారంతో రక్తహీనతకు చెక్



అంగన్వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా నాణ్యమైన సరకులను అందిస్తున్నారు. పోషకాహారం ద్వారా రక్తహీనతకు చెక్ పెట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. శుచి, శుభ్రతతోపాటు ముఖ్యమంత్రి పోషకాహారాన్ని అందించడం సంతోషంగా ఉంది.

– ఈశ్వరమ్మ, గర్భిణి, కడప

పారదర్శకంగా సేవలు



అంగన్వాడీ కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పించింది. ఫేస్‌యాప్ ద్వారా లబ్ధిదారులకు సరుకు అందిస్తున్నాం.ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ఆంగ్ల మాధ్యమంలో బోధన సాగుతోంది. తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా పంపిస్తున్నారు.

– ఎస్.వినీలగ్లోరి, అంగన్వాడీ కార్యకర్త, కడప

కేంద్రాలలో నూతన సంస్కరణలు



అంగన్వాడీ కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఆంగ్ల మాధ్యమం అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. నాడు-నేడు ద్వారా అంగన్వాడీ భవనాల మరమ్మత్తులు, పక్కా భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

– శ్రీలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్, కడప

7న క్యాంపస్ ఇంటర్వ్యూలు

వైవీయూ: నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 7వ తేదీన క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.వి.సలీం బాషా తెలిపారు. డిగ్రీ చేసిన మహిళా అభ్యర్థులు అర్హులన్నారు.

అందరివాడు.. ఈ ఆటోవాలా

- ఉచితంగా మినరల్ వాటర్
- ఆటోలో ఉచితంగా గర్భిణుల చేరవేత

మదనపల్లె సిటీ: ఆటోజానీ, ఆటో రాజా.. ఇలా రకరకాల పేర్లతో కొందరు హీరోలు సినిమాల్లో ఆటో డ్రైవర్ల పాత్రలో అభిమానులను మెప్పించారు. అయితే నిజ జీవితంలో ఆటో డ్రైవర్ పఠాన్ బాబు సామాన్యులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి ప్రయాణ అవసరాలను తీరుస్తూ అందరివాడిగా నిలుస్తున్నాడు.

- మదనపల్లె పట్టణం సైదాపేటకు చెందిన పఠాన్ బాబు దాదాపు 35 ఏళ్లుగా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ ప్యాసింజర్లను ఆటోల్లో తీసుకెళ్తున్నపుడు గర్భిణులు, బాలింతలు, ఇతర ప్రయాణికులు పడే బాధలు చూసి చలించిపోయాడు. అప్పటి నుంచి తాను సంపాదించిన దాంట్లో కొంత మేరకైనా పేదల కోసం వెచ్చించాలనే తపనతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పదేళ్లుగా దివ్యాంగులు, గర్భిణులను ఉచితంగా ఆటోలో తీసుకెళ్తున్నారు. ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఐదేళ్లుగా తన ఆటోలో శుద్ధజల క్యాన్ ఏర్పాటు చేస్తున్నాడు. ప్రయాణికులే కాకుండా బెంగుళూరు బస్టాండులో ఆటో కార్మికులు ఈ మినరల్ వాటర్ తాగుతున్నారు. ఈయన సేవలను గుర్తించిన పలువురు అభినందిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై అభిమానంతో ఆటోలో పార్టీ జెండా గుర్తులు, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఫొటోలు పెట్టుకున్నాడు.



శుద్ధ జలం తాగుతున్న ప్రయాణికురాలు

సేవలోనే సంతృప్తి

వైఎస్సార్ పార్టీ అంటే ఎనలేని అభిమానం. సమాజ సేవ చేయడంలోనే సంతృప్తి కలుగుతోంది. రోజూ సంపాదనలో కొంత మేరకు ఖర్చు చేస్తా. ఆటో డ్రైవర్లు అంటే మంచి భావన కలిగే విధంగా చేయాలన్నదే ధ్యేయం. ఎంతో మంది గర్భిణులను ఉచితంగా ఆస్పత్రులకు తీసుకెళుతున్నా. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగిస్తా.

– పఠాన్‌బాబు, ఆటో డ్రైవర్, మదనపల్లె

క్లుప్తంగా

72 గంటలైనా లభించని యువకుడి ఆచూకీ

గోపవరం : బర్రెలను వెతికేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లిన యువకుడి ఆచూకీ 72 గంటలు గడిచినా లభించకపోవడంతో.. కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కాలువపల్లె పంచాయతీ లక్కవారిపల్లె గ్రామానికి చెందిన బల్లిరవిశంకర్ ఆదివారం ఉదయం.. తప్పిపోయిన బర్రెలను వెతుకులాడేందుకు సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లి తిరిగిరాని విషయం తెలిసిందే. యువకుడి ఆచూకీ కోసం బద్వేలు రూరల్ పోలీసులు, అటవీశాఖ సిబ్బంది సంయుక్తంగా గత రెండు రోజులుగా జల్లెడ పడుతున్నారు. అయినప్పటికీ మంగళవారం రాత్రి వరకు ఆచూకీ లభించలేదు. దీంతో తప్పిపోయిన రవిశంకర్ కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. రూరల్ సీఐ సుదర్శన్‌ప్రసాద్, ఎస్ఐ చంద్రశేఖర్‌లు ఎప్పటికప్పుడు యువకుడి ఆచూకీ కోసం సమాచారం తెలుసుకుంటున్నారు. డ్రోన్ కెమెరాను కూడా ఉపయోగిస్తున్నారు. అయినా ఫలితం లేదు. చుట్టుపక్కల గ్రామాల వారి సహాయం కూడా తీసుకుని అటవీ ప్రాంతంలో వెతుకులాడుతున్నారు. ఎవరికైనా యువకుడి సమాచారం తెలిస్తే వెంటనే బద్వేలు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.

కూలిన మట్టి మిద్దె

– మహిళకు గాయాలు




కూలిన మిద్దె, గాయపడిన మహబూన్నీ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని 11వ వార్డులో నివాసం ఉండే మహబూన్నీకి చెందిన మట్టిమిద్దె పైకప్పు కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇంటి లోపల ఉన్న మహబూన్నీ తలకు గాయాలు అయ్యాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నాని దెబ్బతిని కూలిపోయిందని బాధితురాలు తెలిపారు. సంఘటన విషయం తెలుసుకున్న వెంటనే 11వ వార్డు కౌన్సిలర్ పెన్నరషీద్ , 12వ వార్డు ఇన్‌చార్జి యూసోబ్, 13వ వార్డు ఇన్‌చార్జి కోకోకోల గౌస్‌లు అక్కడికి చేరుకున్నారు. పడిన మిద్దె కింద ఉన్న మహబూన్నీని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. తర్వాత మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలిని ఆదుకుంటామని, ప్రభుత్వం నుంచి వచ్చే సాయం అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. నష్టపరిహారం కోసం నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేసినట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అండర్‌-23 మల్టీడేస్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

కడప స్పోర్ట్స్ : కడప నగరం వేదికగా ఏసీఏ అండర్‌-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. మంగళవారం కడప నగరంలోని కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, చిత్తూరు జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 80 ఓవర్లలో చిత్తూరు జట్టు 9 వికెట్ల వద్ద 243 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని ధరణికుమార్‌నాయుడు 77, అజిత్‌కుమార్ 46 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లు మల్లికార్జున 5, ఎస్. మహమ్మద్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 16 పరుగులు చేసింది. జట్టులోని అర్జున్ టెండూల్కర్ 11 పరుగులతో క్రీజులో ఉన్నాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, కడప జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 78.2 ఓవర్లలో 354 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని పి.సుబ్రమణ్యం 157, రోషన్ పవన్‌కుమార్ 51 పరుగులు చేశారు. కడప బౌలర్లు ఎస్.ఆదిల్‌హుస్సేన్ 5, విజయ భువనేంద్రారెడ్డి 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 8.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 43 పరుగులు చేసింది. జట్టులోని రోహిత్‌వర్మ 21 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు సాకేత్‌రామ్ 2, సాత్విక్ 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.



కేఓఆర్ఎం మైదానంలో పోటీ పడుతున్న కడప, నెల్లూరు జట్లు



పి.సుబ్రమణ్యం, నెల్లూరు, (157 పరుగులు)



ఆదిల్‌హుస్సేన్, కడప, (5 వికెట్లు)



మల్లికార్జున, అనంతపురం, (5 వికెట్లు)

స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి ఎంపికలు



మెడిసినల్ బాల్‌త్రో వేస్తున్న క్రీడాకారుడు

కడప స్పోర్ట్స్ : పులివెందుల వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపికలను స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందులలో హాకీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, టెన్నిస్ క్రీడాంశాల్లో స్పోర్ట్స్ అకాడమీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి పులివెందులలో ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహించి అకాడమీలో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి.అమృత్‌రాజ్ మాట్లాడుతూ బాలుర స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు విచ్చేసిన క్రీడాకారులకు మోటార్ ఎబిలిటీ టెస్ట్, స్కిల్ టెస్ట్‌లు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు అనిల్, అబ్దుల్ మునాఫ్, శ్రీనివాసరాజు, కల్యాణ్‌కుమార్, శ్రీధర్, రాజేంద్ర, శ్యామ్యూల్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి, ప్రవీణ్‌కిరణ్, స్టెప్ సిబ్బంది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ వ్యాన్ బోల్తా

– తప్పిన పెను ప్రమాదం



రోడ్డు పక్కన గుంతలో బోల్తా పడిన వ్యాన్

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామ సమీపాన వీయన్‌పల్లె మండలంలోని యలంకూరిపల్లికు వెళ్లే మార్గంలో.. ఎర్రగుంట్లకు చెందిన శ్రీ జీవన జ్యోతి స్కూల్ వ్యాన్ మంగళవారం బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విద్యార్థులను వ్యాన్‌లో స్కూల్‌కు పిలుచుకుని వస్తున్న సమయంలో తుమ్మలపల్లి, యలంకూరిపల్లె గ్రామాల మధ్య అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న 12 మంది విద్యార్థులు తల కిందికి, కాళ్లు పైకి పడి సుమారు కొన్ని నిమిషాల పాటు నానా ఇబ్బందులు పడ్డారని స్థానికులు తెలిపారు. వెంటనే విషయం తెలుసుకున్న స్థానికులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బోల్తా పడిన వ్యాన్‌లో ఉన్న విద్యార్థులను వారు బయటకు తీశారు. అయితే ఆ విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. వ్యాన్‌ను క్రేన్ సాయంతో బయటకు తీశారు. సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ప్రమాదం ఏ విధంగా జరిగింది.. డ్రైవర్ అజాగ్రత్త వల్ల లేక బ్రేక్ ఫెయిల్ వల్లనా అనే కోణాలలో విచారణ చేపడుతున్నారు. అయితే స్కూల్ యాజమాన్యం మాత్రం ఎలాంటి ప్రమాదం జరగలేదని చెబుతోంది.

రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలోని బద్వేలు, గోపవరం, పోరుమామిళ్ళ మండలాల్లోని పలు రేషన్ దుకాణాల్లో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసూమ్‌బాషా ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ రెడ్డెప్ప నేతృత్వంలో బద్వేలులోని రెడ్డెయ్యమఠంవీధి, గుండంరాజుపల్లె, గోపవరం మండలంలోని పెద్దగోపవరం, పోరుమామిళ్ళలోని గిరినగర్ రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా స్టాకు పాయింట్ నుంచి ఎన్ని క్వింటాళ్ల బియ్యం సరఫరా అయ్యాయి, కార్డులు ఎన్ని, ఎంత మందికి పంపిణీ చేశారు అనే విషయాలపై రికార్డులు పరిశీలించారు. రికార్డుల ప్రకారం తనిఖీ చేసిన అన్ని రేషన్ దుకాణాల్లో స్టాకు సరిగ్గా ఉన్నట్లు గుర్తించినట్లు విజిలెన్స్ సీఐ తెలిపారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటించడంతో పాటు లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని, తూకాల్లో అవకతవకలు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏఓ బాలగంగాధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



బద్వేలులోని రెడ్డెయ్యమఠంవీధిలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురు ఆత్మహత్యకు ప్రయత్నించి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ ఎర్రకాలువపల్లెకు చెందిన రామమూర్తి కుమారుడు బి.ప్రవీణ్(23) సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడి క్రిమి సంహారిణి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అలాగే మదనపల్లె రామునిగుడి వీధికి చెందిన చిన్ను భార్య ఎస్.సోని(26) సోమవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పట్టణంలోని నక్కల దిన్నె గణేష్‌నగర్‌కు చెందిన కె.వసంత(48) ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లుకు చెందిన ఎస్.శంకరరెడ్డి(69) పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పెద్దమండ్యం మండలం సాకేనాయక్ తండాకు చెందిన శ్రీనివాసులునాయక్ భార్య బి.శైలజ(42) భర్తతో గొడవపడి మనస్తాపంతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రొంపిచెర్ల మండలం గానుగచింత గ్రామానికి చెందిన చిన్నమల్లయ్య కుమారుడు టి.మురుగేష్(35) కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో బాధితులను కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న

చౌకబియ్యం లారీ బోల్తా




బోల్తా పడిన చౌక బియ్యం లారీ, బియ్యం గోడౌన్‌కు తరలిస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది

గుర్రంకొండ : కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్న చౌకబియ్యం లారీ బోల్తా పడిన సంఘటన మండలంలోని కోనక్రాస్ వద్ద జరిగింది. అక్కడికి చేరుకొన్న పోలీసులు, రెవెన్యూ అధికారులు రూ.2.40 లక్షల విలువ చేసే 240 బస్తాల చౌక బియ్యాన్ని సీజ్ చేశారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నుంచి చౌకబియ్యం బస్తాల లోడుతో లారీ కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు మంగళవారం ఉదయాన్నే బయలుదేరింది.మార్గంమధ్యలో గుర్రంకొండ మండలం నడిమికండ్రిగ పంచాయతీ పరిధిలోని కోన క్రాస్ వద్దకు చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుట్టను ఢీకొంది. దీంతో లారీ బోల్తాపడింది. అయితే ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకొన్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బియ్యం బస్తాలు అనుమానాస్పదంగా ఉండటంతో రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వాల్మీకిపురం పౌర సరఫరాల సంస్థ డీటీ వెంకటరెడ్డి, వీఆర్వో ప్రవీణ్‌లను ఎస్ఐ దిలీప్‌కుమార్ పిలిపించారు. చౌక దుకాణాల్లో విక్రయించే బియ్యంగా వారు గుర్తించారు. వెంటనే రూ.2.40 లక్షల విలువ చేసే 240 బస్తాల చౌక బియ్యాన్ని సీజ్ చేశారు. వాటిని వాల్మీకిపురం పౌరసరఫరాల సంస్థ గోడౌన్‌కు తరలించారు. డ్రైవర్ వెంకటరమణ, చౌక బియ్యం తరలిస్తున్న వ్యాపారి శివనాగేంద్ర, ఆయన భాగస్వాములైన శరత్, రమణ, నరేంద్రలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరిలో డ్రైవర్ వెంకటరమణ, శివనాగేంద్రలను అప్పటికప్పుడే అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



రామాంజనేయులు(ఫైల్)

ఒంటిమిట్ట : ఒంటిమిట్టకు చెందిన ఎడ్ల రామాంజనేయులు(55) మంగళవారం రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒంటిమిట్ట చెరువు సమీపంలోని రైలు తూము దగ్గరలో ఉన్న రైలు పట్టాలపై మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే సిబ్బంది గుర్తించారు. మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన కొంత మంది స్థానికులు అతని ఆచూకీ గుర్తించారు. మండల కేంద్రంలోని ఒంటిమిట్ట కల్లా వీధిలో ఉన్న జాంబవంతుని స్తూపం ఉన్న వీధిలోని ఎడ్ల రామాంజనేయులుగా తెలిపారు. వారు చెప్పిన వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని రైల్వే ఎస్ఐ తెలిపారు.

మృతుడి ఆచూకీ గుర్తింపు

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని బోటుమీదపల్లి దళితవాడ సమీపంలో సోమవారం రైలుపట్టాలపై గుర్తుతెలియని 25 సంవత్సరాల వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మంగళవారం ఆచూకీ గుర్తించారు. పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పాస్యం పవన్ కళ్యాణ్ (25)గా గుర్తించారు. బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం ఇంటిలో సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం ఉంచి బయటకు వెళ్లాడని, రాత్రికి రైలు పట్టాలపై మృతి చెందాడనే సమాచారం అందిందన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బసినికొండ బెస్తపల్లెకు చెందిన వెంకటరమణ భార్య ఎం.సంపూర్ణమ్మ(60) మంగళవారం వ్యక్తిగత పనులపై పట్టణంలోకి వచ్చి గణేష్ హోటల్ వద్ద రోడ్డుపై నిల్చుని వేచి చూస్తుండగా.. రామారావుకాలనీకి చెందిన వై.బాలాజీ ద్విచక్రవాహనంలో వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆమె గాయపడింది. అదే విధంగా బండ్లపై గ్రామానికి చెందిన జి.వేణుగోపాల్ ద్విచక్రవాహనంలో బోయకొండకు వెళ్తుండగా.. ఎదురుగా కారు వచ్చింది. ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితుడ్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఢీకొన్న బైకులు

రాజంపేట : పట్టణంలోని తోట కల్యాణ మండపం సమీపంలో మంగళవారం రెండు బైకులు ఢీకొనడంతో.. వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. పుల్లంపేట మండలం దళవాయిపల్లెకు చెందిన శశి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్ర గాయాల పాలయ్యాడు. బాధితుడిని 108 వాహనంలో రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు.



గాయపడిన శశి

తేనెటీగల దాడిలో..

మదనపల్లె : తేనెటీగల దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలో జరిగింది. దిగువపల్లె పంచాయతీ అప్పినేపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్ప(62) గొర్రెలు మేపుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం యథావిధిగా గొర్రెలను మేపేందుకు అడవికి తోలుకెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా అడవిలో తేనెటీగల గుంపు అతడిపై దాడి చేసింది. ఇందులో అతను తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటున్నాడు.



గాయపడ్డ చిన్నరెడ్డెప్ప

పాముకాటుతో మహిళకు అస్వస్థత

మదనపల్లె : పాము కాటుకు గురై మహిళ అస్వస్థత పాలైన సంఘటన మంగళవారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. ఎద్దులవారిపల్లెకు చెందిన సిద్ధమల్లు భార్య పద్మావతి(44) పొలం వద్ద పనులు చేసుకుంటుండగా, పాముకాటుకు గురైంది. దీంతో ఆమె తీవ్ర అస్వస్థతకు లోనుకాగా, కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటోంది.

ఆగి ఉన్న కారును ఢీకొన్న బైక్

– ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు




తీవ్రంగా గాయపడ్డ రెడ్డిశేఖర్, రెడ్డి

సంబేపల్లె : మండల పరిధిలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ఆగి ఉన్న కారును బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వీరబల్లి మండలం తోటకాడ దళితవాడకు చెందిన రెడ్డిశేఖర్, రెడ్డిలు ద్విచక్ర వాహనంలో కలకడ వైపు వెళ్తుండగా.. మార్గంమధ్యలోని శ్రీదేవరరాయి నల్లగంగమ్మతల్లి క్రాస్ వద్ద ఆగి ఉన్న కారును ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 సాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్ఐ షరీఫ్ పరిశీలించారు.

టీడీపీ నేతలపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలో ఈ నెల 2వ తేదీన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పాత గ్రంథాలయం స్థలంలో తెలుగుదేశం పార్టీ నేతలు శ్రీనివాసులరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వారి అనుచరులు, కార్యకర్తలు అనుమతుల్లేకుండా నిరసన దీక్షలు చేపట్టారని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ సయ్యద్ హాసం, ఎస్ఐ జయరాముడు ఆధ్వర్యంలో ఫిర్యాదును పరిశీలించి.. పై నేతలపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో వున్న క్రమంలో 24 గంటల ముందుగా అనుమతులేవీ తీసుకోకుండా దీక్షలు చేపట్టారని సీఐ తెలిపారు. అంతేగాక పాత గ్రంథాలయ స్థలంపై కోర్టులో వివాదం నడుస్తోందని, ఈ క్రమంలో టీడీపీ వారు నిరసన దీక్షలు కొనసాగించడం భావ్యం కాదని, ఇందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్ఐ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు టీడీపీ నేతలు, వారి కార్యకర్తలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

గండిలో అక్రమాలు నిరూపిస్తే

రాజీనామా చేస్తాం

టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి పాలక మండలి సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న గండి పాలకమండలి బృందం

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో అవినీతి, అక్రమాలు జరిగాయని నిరూపిస్తే తామంతా రాజీనామా చేస్తాం, నిరూపించక పోతే నీవు రాజీనామా చేసేందుకు సిద్ధమేనా అని టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి ఆలయ చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్, పాలక మండలి సభ్యులు సవాల్ విసిరారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి గండిలో అక్రమాలు చోటు చేసుకున్నాయని పత్రికల ద్వారా వెల్లడించారు. ఈ విషయంపై గండిలో పాలకమండలి బృందం మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ పని చేసిన అధికారులు, పాలక మండలి శాశ్వత నిత్యాన్నదానం పేరుతో వారం లో ఒక్క రోజు మాత్రమే భక్తులకు అన్నం పెట్టేవారని, ఇప్పుడు ప్రతి రోజూ అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. అన్నదానం విరాళాలు తమ పాలక మండలి ప్రమాణ స్వీకారం నాటికి రూ.60 లక్షలు డిపాజిట్లు ఉండగా, ఇప్పుడు రూ.3.10 కోట్లకు పెంచామని చెప్పారు. ఈ నిధులకు సంబంధించిన వడ్డీతో మాత్రమే అన్నదానం చేయాలని కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారమే చేస్తున్నామన్నారు. కమిషనర్ రోజుకు వంద మందికి అన్నదానం చేయాలని చెబితే, గండిలో 200 మందికి ఆకలి తీరుస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో రాంగోపాల్‌రెడ్డి కమిషనర్ 200 మందికి అనుమతి ఇచ్చారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. లడ్డూ విషయానికి వస్తే 200 గ్రాములతో తయారు చేస్తున్నామని ఎప్పుడైనా తూకం వేసుకోవచ్చని చెప్పారు. భక్తుల సంఖ్య తగ్గితే ఒకటి, రెండు రోజులు లడ్డూల స్టాక్ ఉంటే.. తడి శాతం తగ్గి పది గ్రాములు తగ్గ తుంది తప్ప భక్తులను ఎప్పుడూ మోసం చేయలేదని చెప్పారు. గండి ఆలయం వైఎస్ కుటుంబ హయాంలోనే అభివృద్ధి చెందిందని తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి టీటీడీలోకి మార్చి రూ.17 కోట్లు మంజూరు చేయిస్తే రూ.7 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. ఆయన మరణించాక నిదులు వెనక్కు వెళ్లి పోయాయని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో ఒక్క పైసా కూడా ఇవ్వలేదని చెప్పారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక నేడు రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి, రాజారమేష్, పాలక మండలి సభ్యులు రామాంజులరెడ్డి, ఈశ్వరరెడ్డి, గంగాభారతి, రెడ్డెయ్య, అనూష తేజ, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

190 మద్యం బాటిళ్లు స్వాధీనం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని రాజుగారివీధిలో గల ఓ ఇంటిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 190 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ పి.యుగంధర్ తెలిపారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. రాజుగారివీధిలో పాదిలి సత్యనారాయణ ఇంటిలో ఎస్ఐ, సిబ్బంది వెళ్లి తనిఖీలు నిర్వహించగా, 190 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయన్నారు. అతను పలు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యం కొనుగోలు చేసి వాటిని అధిక ధరలకు అమ్ముతున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. సమావేశంలో అర్బన్ ఎస్ఐ వెంకటరమణ, కానిస్టేబుళ్లు వెంకటసుబ్బయ్య, హరినారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, వీరమోహన్ తదితరులు పాల్గొన్నారు.



పట్టుకున్న మద్యం, నిందితుడితో సీఐ, ఎస్ఐ

ఒకరి అరెస్ట్

నందలూరు (రాజంపేట) : నందలూరు గ్రామ పంచాయతీలోని నందలూరు దళితవాడలో సోమవారం రాత్రి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు. ఆమె వద్ద ఉన్న 18 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గాంధీ జయంతి రోజు దాడులు నిర్వహించగా గోనె సంచి లో మద్యం బాటిళ్లు ఉంచుకొని విక్రయిస్తున్న పెనికల ఆదిలక్ష్మమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకున్నామ ని చెప్పారు. ఆమెపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ దాడులలో పోలీసులు శ్రీనివాసులు, దర్బార్ బాషా, హోంగార్డు మెరీలు పాల్గొన్నారు.